# జమీందారీలరద్దు

## రివిన్యూ మంత్రి సమాధానం

మద్రాసు రెవిన్యూమంత్రి శ్రీ కళా వెంకట్రావు గారు క్రింది ప్రకటన చేస్తున్నారు.

ప్రస్తుత మంత్రివర్గం జమీందారులకు లొంగిపోయిందని, ప్రస్తుత ప్రభుత్వవిధానం రైతుల హక్కులకు భంగకరమని పీకో సైదా రాజకీయ సభలో ప్రకాశంగారు అన్నారు.

ప్రభుత్వం పక్షాన ఇస్తున్న ప్రతిపాదనను శ్రీ ప్రకాశంగారు సరిగా పరిశీలించలేదని తెలుపడానికి చింతిస్తున్నాను. జమీందారీలను వెంటనే రద్దుచేసే బిల్లును ప్రతిపాదించడమే ప్రభుత్వం ఉద్దేశం. ఈ బిల్లు కూడా దాదాపు పూర్తిఅయినట్టే. ఎస్టేట్లను స్వాధీనం చేసుకొని, రైతులనుండి ఎంతశిస్తు వసూలుచేయాలో నిర్ణయించడానికి సుమారు నాలుగైదేండ్లకాలం పడుతుంది. అందుకోసం, ఇప్పటికే నానాబాధలుపడి ఎక్కువ శిస్తు చెల్లిస్తున్న జమీందారీరైతులను ఎస్టేట్లపై పరిపాలన ప్రభుత్వ పరమైనప్పటికీ, నాలుగైదేండ్లకాలం వేచివుండమని కోరడం ఉచితంకాదు. ఇదంతా ఆలోచించే జమీందారీభూములపై శిస్తును ప్రక్కనేవున్న రైత్వారీ భూమిశిస్తుతో సమానంగా తగ్గించి, తాత్కాలికంగా కొంత సహాయంచేయాలని ఆలోచించాము. ఇంతలోగా జమీందారీలు రద్దుచేయబడతాయి.

దీనివల్ల రైతులకు చాలా లాభం కలుగగలదు. ఎస్టేట్లను ప్రభుత్వం వశపరచుకోగానే, రాష్ట్రమంతటా ఒకే రైత్వారీ శిస్తువిధానం వుండగలదు. 1802 లేక 1810 నాటి శిస్తురేట్లే వుండాలా, లేక మరే రేట్లయినా వుండాలా అనే చర్చకు ఇదే తగిన సమయం. ఇప్పటి రైత్వారీ విధానంలోకూడా ఎన్నో మార్పులు చేయవలసివుంది.

శిస్తురేట్లను తగ్గించినంతమాత్రాన లాభంవుండబోదని, శిస్తువిధానాన్నే మార్చడం ముఖ్యమని చెప్పక తప్పదు. ఇప్పటి భూమిశిస్తు విధానం చాలా లోపభూయిష్టం. అందువల్ల, శిస్తురేట్లను తగ్గించినంతమాత్రాన లాభమేమీలేదు. ఇప్పటి శిస్తువిధానానికి మారుగా మరొక అభ్యుదయకర విధానం అమలుపరచవలసిన అవసరంవుంది.

ఈ సందర్భంలో కొనుగోలు పన్నులాంటి మరికొన్ని విధానాలనుగురించికూడా ఆలోచించవలసివుంటుంది. వీటి నన్నింటినీ ప్రభుత్వం పర్యాలోచిస్తున్నది. 1802 నాటి రేటుకు శిస్తుతగ్గిస్తానని, రైత్వారీభూములలో 1810 తర్వాతజరిగిన పెరుగుదలనంతా రద్దుచేస్తానని శ్రీ ప్రకాశంగారు పదేపదే చెబుతున్న మాటలు ఆధునిక పన్ను విధానానికి అనుగుణమైన వికావు. ఇంతకంటె విప్లవాత్మక విధానాలను మనం లక్ష్యంగా పెట్టుకోవాలి. ప్రజాసామాన్యానికి సహాయపడేమార్గం చూడాలి.

కాలయాపన జరుగుతున్నదని శ్రీ ప్రకాశంగారు నిందించడానికైనా ఆస్కారంలేదు. ఆయన 30 నెలలు రెవెన్యూమంత్రిగాను, 11 నెలలు ప్రధానిగానువుండి సాధించలేనివాటిని ప్రస్తుత మంత్రివర్గం 6 నెలలలో సాధించడానికి ప్రయత్నిస్తున్నది. ఆయన నాపట్ల ప్రవర్తించినట్లు నేను ఆయనపట్ల అన్యాయంగా ప్రవర్తించబోను. ఆయనవేసిన పునాదిపైనే నేను భవన నిర్మాణం చేస్తున్నాను. ఆ భవనం ఆధునికంగావుండి పేదలకు ఉపయోగించేవిషయంలో శ్రీ ప్రకాశంగారు కలతపడవలసిన పనిలేదు.

శిస్తుతగ్గించడం, జమీందారులకు అధికంగా నష్టపరిహారం ఇవ్వడంకోసమేనని శ్రీ ప్రకాశంగారు చెప్పడం చాలా విడ్డూరం. నేనిదివరకు చెప్పింది నిజంగా ఆలోచించేవారికి అన్యాయంగా తోచదు. పీంకో సైకో ఆయన చెప్పినమాటలు పెద్దమనిషి తరహాను మించిపోయాయి. జమీందారులను ఎవరు ప్రతిఘటించారో, వారిక్రిందను ఎవరు ఎదుర్కొన్నారో ప్రస్తుత శిస్తువిధానం రైతుకు నష్టకరమో, శ్రేయోదాయకమో కాలమే నిర్ణయించగలదు. మా లక్ష్యాన్ని సాధించడానికి నిర్ణయించిన గడువుకూడా దీర్ఘంకాబోదు. "ఇలాచేసివుండేవాడిని, అలాచేసివుండేవాడిని" అనే మాటలను చెప్పడంకంటె, "ప్రజాశక్తితో నేను ఇంతచేశాను, చేయగలను" అని తెలుపడమే నా అభిమతం."

## ❁ వార్తలు. ❁

రాజ్యాంగ పరిషత్తునుండి కొన్ని కార్యకలాపాలకు సంబంధించిన పత్రాలు దొంగతనంపోయినట్లు వార్త. జూనియర్ ఉద్యోగస్థుల్లో ముస్లింలీగ్ పట్ల అభిమానం కలవారిని అనుమానిస్తున్నారు.

• • •

మద్రాసు లేబర్ యూనియన్ల అధ్యక్షుడు మిస్టర్ అంతోనీపిళ్ళై - దేశబహిష్కరణాన్ని ప్రతిఘటించినందుకు హైదరాబాదు సబ్‌డివిజనల్ మేజిస్ట్రేటు ఒక సంవత్సరం శిక్షవిధించాడు.

• • •

స్టెర్లింగ్ నిల్వల సంప్రతింపుల్లో పాల్గొనడానికి కేంద్రప్రభుత్వ ఆర్థికశాఖ కార్యదర్శి శ్రీ సి. వి. నరహరిరావు మిస్టర్ బి. కె. నెహ్రూగార్లు త్వరలోనే లండను వెళ్ళతారట.

• • •

బ్రిటిష్ మెడికల్ రిజిష్టర్‌లో ఆంధ్ర విశ్వవిద్యాలయం యం. బి. బి. యస్. డిగ్రీలు పొందినవారిని రిజిష్టరు చేసుకోవడానికి బ్రిటిష మెడికల్‌రిజిస్ట్రార్ తెలియజేశారట.

• • •

లోగడ ప్రయోగింపబడ్డ అటం బాంబులకంటె యితోధిక దారుణమైనవి అమెరికాలో క్రొత్తగా ఎన్నో సృష్టింపబడి వున్నట్లు వార్తలు వస్తున్నాయి.

• • •

విభక్త పంజాబురాష్ట్రం సరిహద్దు నిర్ణయానికి అసమ్మతి తెలుపుతూ జూలై 8 తేదీన భారతదేశమంతటా శిఖులు సమ్మెచేయాలని అధికారపూర్వకంగా ప్రకటింపబడింది.

• • •

మిల్లుగుడ్డలపై కంట్రోల్‌ను క్రమేపీ రద్దుచేయడానికి మద్రాసు ప్రభుత్వం నిర్ణయించిందని వార్త.

• • •

మద్రాసు రాష్ట్రములోని మోటారు రవాణాను జాతీయం చేయడానికి అవలంబించవలసిన ప్రభుత్వ కార్యక్రమప్రకటన వచ్చేవారంలోగా వెలువడుతుందట.

• • •

ఆఫ్గానిలో భారతరాయబారిగా సర్ బెనిగల్ రామారావుగారు నియమింపబడ్డారు. జూలై రెండో వారంలో ఆయన ఆఫ్ఘానుకు పయనమవుతారు.

• • •

దాదాపు 20 కోట్ల సొమ్ము, వెండి, బంగారు సింధునుంచి బొంబాయికి మార్చబడిందట. వర్తకులైన హిందువులందరూ క్యాంపుల్లో ఉన్నవారికూడా హాని అంటుందేమోనని భయపడుతున్నారు.

• • •

మద్రాసులో నడుస్తున్న బస్సులన్నిటినీ ఆగస్టు 1 తేదీనుంచి మద్రాసుప్రభుత్వంవారు తీసుకొని నిర్వహించుటకు నిశ్చయించారట.

D. C. M. 80.

సూపరు ఫాస్ ఫేట్లు వేసిన దీ చెరకు పంట






మీరే పరిశీలించి చూడండి. మీ భూమికి డి. సి. యమ్. సూపరు ఫాస్ ఫేట్లు వేసి మీ చెరకుపంట ఎంత బాగా పెరుగుతుందో, ఎంతత్వరగా పక్వానికి వస్తుందో గమనించండి. ఏ ఏటా పండించటంవలన భూమినుంచిపోయే సారాన్నే డి. సి. యమ్. సూపరు ఫాస్‌ఫేట్లు తిరిగి లభింపచేస్తాయి.

డి. సి. యమ్. సూపరు ఫాస్‌ఫేట్లు అత్యుత్తమమైన ఎరువులేకాక, వరి, గోధుమ, టీ, కాఫీ, పొగాకు, రబ్బరు, చెరకు, బంగాళాదుంపలు, పళ్లు, కూరగాయలు, జనప, జొన్న మొదలైనవి పండే పంటభూములకు ముఖ్యంగా పనికివస్తవి.

మీ భూమిని తిరిగి సారవంతంగా చేయటానికి

డి సి ఎమ్

సూపరు ఫాస్‌ఫేట్లు

మీ భూమిని సారవంతంగా చేయటానికి డి. సి. యమ్. సూపరుఫాస్‌ఫేట్లు.
సూపర్ ఫాస్‌ఫేట్ల ప్రయోజనాలు, వెలలు మొదలైన వివరాలకు :
డి. సి. ఎమ్. కెమికల్ వర్క్సు, పోస్టుబాక్సు నెం. 211 నజాఫ్‌ఘర్‌రోడ్డు, ఢిల్లీ.

Printer, Publisher & Managing Editor N. V. Rama Naidu, Zamin Ryot Power-Press 176 Danduvari St. & 99 Thipparajuvari St., Nellore.